క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలను అరికట్టండి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలని అరికట్టాలని గ్రామ యువకులు బెస్త యాదగిరి, బెస్త భీంరాజు గురువారం తహసీల్దార్‌ను కలిసి విన్నవించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రెస్ భవనం వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రి డబ్బాలు, నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల ఫిర్యాదుతో స్పందించిన తహసీల్దార్ పాండు నాయక్ నిర్మాణాలు చేపట్టిన స్థలాన్ని పరిశీలించాలని ఆర్ఐ గణేష్‌ను ఆదేశించారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి ప్రభుత్వ భూమిలో కట్టడాలను చేపడితే చర్యలు తీసుకుంటామని

క్యాలెండర్ ఆవిష్కరణ



పాన్‌గల్: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్‌జీటీయూ) 2024 క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం కాంప్లెక్స్ హెచ్ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాములు, యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులు ఐకమత్యంతో పోరాడాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు తాగునీరు అందించాలి



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేని కారణంగా ఇబ్బందుల పాలవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాఘవ అన్నారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నల్లా నీళ్లను ఇస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఫిల్టర్ నీటిని అందుబాటులో ఉంచాలని కోరారు. సరిపడే బాత్రూంలు లేకపోవడం, తరగతి గదులు తక్కువగా ఉన్నాయని సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, కుమార్, అంజి, కృష్ణ, రాకేష్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్య అందిస్తున్నామని, మధ్యలో చదువు మానేసిన పిల్లలను బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి తిప్పుడంపల్లిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు.

క్రీడాకారిణికి సన్మానం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లికి చెందిన కొండయ్య కుమార్తె నందిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్థానిక నాయకులతో కలిసి గురువారం పెబ్బేరులోని మాంటిస్సోరిప్లేవే స్కూల్‌లో క్రీడాకారిణి నందిని అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రైవేటు పాఠశాలలో క్రీడలను ప్రోత్సహిస్తున్న పాఠశాల యజమాన్యాన్ని, పీఈటీని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజేందర్‌గౌడ్, పీఈటీ మహేష్, అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

చిన్నచింతకుంట: తెలుగు దేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర ఇన్‌చార్జ్ బక్కని నర్సింహులు పిలుపునిచ్చారు. గురువారం తిర్మలాపురంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ప్రజలకు న్యాయం జరగాలంటే పార్టీ అధికారంలోకి రావాలన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమం



అజ్జకొల్లులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అజ్జకొల్లులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రజల వద్దకే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్నారు. సంక్షేమం, అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా పాలన సభలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు హైస్కూల్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, సరదాగా ముచ్చటించారు. పాఠశాల మౌలిక వసతుల ఏర్పాట్లపై డీఈఓతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బ్రహ్మమ్మ, ఉప సర్పంచ్ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ నాగేంద్రం, మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: రేమద్దులలో 1,541, శాగాపూర్ 671, రాయినిపల్లిలో 303 దరఖాస్తులు కలిపి మొత్తం మండలంలో 2,515, ఇతర దరఖాస్తులు 268 వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రహిమాన్, తహసీల్దార్ రాంబాయి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్‌లు మంజుల, మౌనిక, చంద్రశేఖర్, ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

7,192 దరఖాస్తులు

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 7,192 మంది దరఖాస్తులు అందజేసినట్లు తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలనలో 1,318, బొల్లారంలో 744 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, సర్పంచ్ నర్సింహారెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలంలోని విలియంకొండ, ఈదులబాయి తండాలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాంమహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ బాల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి యుగంధర్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు నారాయణమ్మ, శేఖర్‌రెడ్డి, శివరాజు, బీచుపల్లియాదవ్, మాసన్న, రాంచంద్రయ్య, గౌతమ్‌రెడ్డి, ప్రశాత్ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: గురువారం వనపర్తి మండలంలోని సవాయిగుడెం, వెంకటాపురం, మెంటెపల్లిలో 923 ,పెబ్బేరు మండలంలోని గుమ్మడం, కంచిరావుపల్లిలో 655, శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో 415 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ప్రవీన్‌కుమార్, ప్రసన్నకుమారి, సుదర్శన్, తహసీల్దార్లు మురళీగౌడ్, లక్ష్మి, యాదగిరి, కౌన్సిలర్ పార్వతి, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లలో 930, ఆరేపల్లిలో 747, మున్సిపాలిటీలో 356 దరకాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారుశ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ఎంపీపీ కొటేష్, సర్పంచ్‌లు ప్రశాంతి, అనసూయమ్మ, మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు, ఎస్ఐ నరేందర్ పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని నందిమళ్లలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకాధికారి స్వరణ్ సింగ్ దరఖాస్తులు స్వీకరించారు.నందిమళ్లలో 637 దరఖాస్తులతో పాటు 169 రేషన్ కార్డు కోసం, పట్టణంలో 326 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురం, మల్కాపురం, సూరాయపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. మల్కాపురంలో పాల్గొన్న ఎంపీడీఓ విజయ్‌కుమార్ దరఖాస్తులు స్వీకరించారు. మూడు గ్రామాల్లో గురువారం 1,086 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.



పెబ్బేరులో..



ఈదులబాయితండాలో..



శాగాపూర్‌లో..



వీపనగండ్లలో..

ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించాలి



పాన్‌గల్: ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించేలా విద్యార్థులచే వర్క్ షీట్లను ప్రాక్టీస్ చేయించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమం నిర్వహణలో ఎఫ్ఎల్ఎన్ అమలు, పాటించాల్సిన, మరిచిపోకుండా ఉండాల్సిన అంశాలు, ప్రతి రోజు విద్యార్థుల హాజరు 80 శాతం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల వారీగా ఆర్పీలచే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాములు, ఆర్పీలు బండి శ్రీను, రాఘవేంద్ర, సురేందర్‌రెడ్డి, సీఆర్పీలు గోవింద్, భార్గవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడి కుమారుడు అశోక్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఫోనులో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం పంపించారు. ఆయన పంపించిన రూ.10వేలు, గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి రూ.5వేలను జెడ్పీటీసీ పద్మ, రాజశేఖర్, మాజీ ఎంపీపీ సుజాత, బొజ్జన్న, ఆంజనేయులు, రాముడు బాధిత కుటుంబానికి అందజేశారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



ఆత్మకూర్‌లో అక్షింతలను ఊరేగిస్తున్న వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పండుగను జరుపుకోవాలని నాయకులు కోరారు. రామమందిర ట్రస్ట్ పంపిన అక్షింతలకు గురువారం నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, తమ్మలివిజయ్, మాస్టర్‌బాలు, మ్యాడంశ్రీను, నర్సింహారెడ్డి, కొండాపురం రాము, కిషన్‌చంద్, తోట రవి, కిషోర్, వెంకటేష్, లింగన్న, బాలకృష్ణ, బాలు, గాడిశేషు, రఘుయాదవ్ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరులో గురువారం శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు భక్తులతో కలిసి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, కలశాలను ఊరేగించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ అక్షింతలతో పాటు ఫొటో, కరపత్రాన్ని పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, ఆంజనేయులు, వేణుగోపాల్, మాధవుడు, రాముడు, వెంకటేష్, నరసింహ తదితరుఉలు పాల్గొన్నారు.



సూగూరులో అక్షింతల ఊరేగింపు

అంబులెన్స్ సమకూర్చాలని వినతి



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ వసతి కల్పించాలని కోరుతూ గురువారం సీపీఎం నాయకులు మండల వైద్యాధికారి వంశీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ఆస్పత్రికి మంజూరయిన అంబులెన్స్‌ను జిల్లా కేంద్రానికి తరలించారని, దీంతో ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని దాదాపు 31 గ్రామ పంచాయతీల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే అంబులెన్స్ వసతిని కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో మురళి, ఆశన్న, ఈశ్వర్, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఖిల్లాఘనపురంలో నంబర్ ప్లేట్లు లేని వాహనాలను చూపుతున్న పోలీసులు

ఆత్మకూర్: సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. గురువారం ఎస్పీ రక్షిత కే మూర్తి ఆదేశాల మేరకు పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా 21 ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వాహనదారులు అన్నిరకాల అనుమతులు, నెంబర్‌ప్లేట్లు, హెల్మెట్లను తప్పని సరిగా ఉండేటట్లు చూసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ద్విచక్ర వాహనదారులు తప్పకుండా వాహనాలకు సంబంధించిన పత్రాలను, నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని పెద్దమందడి ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం గురువారం మండలంలో స్పెషనల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 10 ద్విచక్ర వాహనాలకు నంబర్‌ప్లేట్, సరైన పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలను ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే వాహనం యొక్క యజమానిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఖిల్లాఘనపురం: నెంబర్ ప్లేట్ లేని మోటార్‌సైకిళ్లకు చలానా విధిస్తున్నామని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. గురువారం సాయంత్రం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రోడ్డుపై సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి చలానా విధించారు. వాహనదారులు తమ వాహనాలనకు నెంబర్ స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరించారు.



పెద్దమందడి పోలీస్ స్టేషన్‌లో..

హైమాస్ట్ లైట్ల మరమ్మతు

అమరచింత: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లలో కొన్ని ఖాళీపోవడంతో వాటి స్థానంలో కొత్తగా లైట్లు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా తెలిపారు. మున్సిపల్ విద్యుత్ కార్మికుడు అలీపాషా ఆధ్వర్యంలో రాజీవ్‌చౌక్‌తో పాటు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఉన్న హైమాస్ట్ లైట్ల మరమ్మతు పనులను చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో అంధకారం లేకుండా ఎప్పటికప్పుడు విద్యుత్ బల్బులు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయండి



పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మించిన సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయకపోవడం, రోడ్డుకు మధ్య, మధ్యలో బ్రేక్ కట్టలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ మహిళ బైక్ ప్రమాదంలో తలకు గాయం , ఓ ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ చేతికి గాయం అయినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి, రోడ్డు మధ్యలో బ్రేక్ కట్టలు నిర్మాణంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.భవానికి గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో భవాని పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లాల్సి ఉండటంతో ఖర్చుల నిమిత్తం గ్రామస్తులు గురువారం రూ.18,500లను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ చేతుల మీదుగా అందజేయించారు. అదేవిధంగా పాటల పోటీలు, ఎస్‌సీఎస్‌సీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మరో ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.వేయి అందజేశారు.

ఉప్పులో అయోడిన్ పరీక్షలు

మానవపాడు: ఉప్పులో అయోడిన్ ఉందా? లేదా అనే పరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఉప్పులో అయోడిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశానుసారం ఆరోగ్యకేంద్ర పరిధిలోని 22 గ్రామాల్లోని 461 ఇళ్లలో, 45 కిరాణం షాపుల్లో, 8 హాస్టళ్లలో, 51 అంగన్‌వాడీ సెంటర్లలో ఉప్పులో అయోడిన్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. 438 సెంటర్లలో పరీక్షించిన ఉప్పులో అయోడిన్ ఉందని, 127 సెంటర్ల ఉప్పులో అయోడిన్ లేదని గుర్తించామన్నారు. అయోడిన్ లేని సెంటర్లలో అయోడిన్ ఉన్న ఉప్పును వాడాలని, అయోడిన్ లేని ఉప్పు వాడితే థైరాయిడ్ వస్తుందన్నారు. దానివల్ల కలిగే నష్టాలను ఆయా సెంటర్ల వారికి వివరించామన్నారు. కార్యక్రమంలో సత్యానారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి

పాన్‌గల్: బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రం వారిచే బాలికను రక్షిద్దాం-బాలికలను చదివిద్దాం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలు మంచిగా చదువుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా, ఆత్మస్థైర్యంతో ఉండాలని సూచించారు. సృష్టికి మూలమైన స్త్రీలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జనరల్ స్పెషలిస్ట్ శ్రీవాణి అన్నారు. నేటి సమాజంలో బాలురకంటే బాలికలే ముందున్నారన్నారు. బాలికలు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా 181, 100 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సఖి సెంటర్ అధికారులు సలోమి, సుమ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ



పూజలో పాల్గొన్న దీక్షాపరులు

ఆత్మకూర్: జ్యోతిస్వరూపుడు అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప క్షేత్రంలో ఆత్మకూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురుస్వాములు, అనిల్, శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి దీక్ష అందరికీ మోక్షదాయకమని స్వామియే శరణం అయ్యప్ప అంటూ ఘోషించే అయ్యప్పస్మరణ శుభదాయకమన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, దీక్షాపరులకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, నాయకులు రవికుమార్, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, మచ్చేందర్‌గౌడ్, ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు జిందే శ్రీను, తౌకలి శ్రీను, తిర్మలేష్, విజయ్‌కుమార్, లూకాస్, మహమ్మద్ రఫీ, గురుస్వాములు జిన్నారం శ్రీను, బాలు, తోటరవి, గాడిలక్ష్మణ్, పురుషోత్తం, దివాకర్, నరేష్, హర్షగౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

మెస్ బిల్లులు వెంటనే చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వనపర్తి టౌన్: గురుకులాల్లో ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్‌లో ఐదు నెలలుగా రూ.5,485 కోట్ల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దీంతో గురుకులాల్లో విద్యార్థులకు నాసిరకమైన మెనూ అందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



బంగారు శ్రుతికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుమలనాథ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతికి గురువారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమలలో 7 కొండలు ఉన్నట్లుగానే తిరుమలనాథస్వామి గుడి (తిరుమలయ్య గుట్ట)లో సైతం 7 కొండలు, అరుదైన వృక్ష జాతులు, ఔషధ మొక్కలు, గతంలో కొంత మంది ప్రొఫెసర్లు ఇక్కడ సంజీవిని మొక్క కూడా ఉందని గుర్తించారని తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేసి, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరారు. అంతకు ముందు బంగారు శృతిని నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, పట్టణ ఉపాధ్యక్షుడు రాము, ఓం ప్రకాశ చారి తదితరులు పాల్గొన్నారు.

మైబూస్ సుభానీ గంధోత్సవం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మైబూస్ సుభానీ గంధోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా నుంచి మసీదు వరకు ఊరేగింపుగా వెళ్లారు. మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ శశికళ శివశంకర్, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, మసీదు కమిటీ అధ్యక్షులు శాలిమియా, బాలపీరు, మైనద్దీన్, రఫీ, ఉస్సేన్, ఖాజా, నజీర్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.